
# పడగ నీడ



విజయనగరం స్టేషన్‌లో మెయిలు ఆగింది. ప్లాట్‌ఫారంలో ఉన్న సత్తువంతా కూడగట్టుకుని లేచాడు నారయ్య. యువకులు, దేహదార్ఢ్యం ఉన్న రైల్వే పోర్టర్లు తూనీగల్లా బండితోపాటు పరిగెత్తి అప్పుడే సామానులు నెత్తిన పెట్టుకుని వస్తున్నారు.

నారయ్య కళ్లలో ఆవేదన వర్ణనాతీతం. నెత్తి కాలిపోతూంది. రెండు ఝాములయింది; ప్రొద్దుటినుండీ నీళ్లయినా కడుపులో పోసుకోలేదు. 'ఇప్పుడు కూడా కూలి దొరక్కపోతే....?' కడుపులో పేగులు మెలి తిరుగుతూంటే తడబడే అడుగులతో సెకండుక్లాసు కంపార్టుమెంటు దగ్గిరికి వచ్చి తొంగి చూశాడు. ఎవరో ఒక నడి వయస్సు ఆసామి, మంచి ధనవంతుడులా ఉన్నాడు, అప్పుడే మీదనున్న పళ్లబుట్ట కిందకు దించుకుని వెనుదిరిగి చూశాడు.

"బాబూ, కూలి ఇప్పించండి. రైల్వేరేటు చెప్పినే ఇయ్యండి. పావలే. ఎక్కువొద్దు. మరెవర్నీ పిలవకండి బాబూ. నేనుకూడా సామానెత్తగలను బాబూ. నా ఆకారం చూసి అనుమానించకండి."

ఆ వ్యక్తి పైపు వెలిగించి సాదరంగా నారయ్య వైపు చూశాడు. వట్టి ఎముకలగూడు. చెమటలో జనపనార లాంటి తల, గడ్డం సన్నగా మెరుస్తున్నాయి.

"సరే. ఎత్తుకో సామాను."

నారయ్యకు అప్పుడే కడుపు నిండినట్లయింది. సామాను నెత్తిన పెట్టుకుని ఆ వ్యక్తి వెంట బ్రిడ్జి

కష్టాలు భరించవచ్చు. శత్రువులను ఎదుర్కొనవచ్చు. ఎన్నయినా సహించి నిలవ గల బలం మనిషికి ఉంది. కాని, నమ్మినవారు మోసంచేస్తే తట్టుకొనగల శక్తి మాత్రం ఎవరికీ ఉండదు. దయ, వాత్సల్యం, కరుణ, మైత్రి ప్రదర్శించి ఎంతటి వారినయినా మోసం చేయవచ్చు. కనుకనే నమ్మకద్రోహానికి మించిన నేరం లేదు.

---

నిండా నడవసాగేడు.

అప్పుడే అక్కడికి ఓ కారు దూసుకుంటూ వచ్చి ఆగింది. అందులోనుంచి నలభై ఏళ్లామె, అచ్చు గజలక్ష్మిలా ఉంది, ఆదరా బాదరాగా వచ్చి రైలులోనుంచి దిగిన వ్యక్తి వైపు చూసి ముఖం నిండా ఆనందపడింది.

"రైలు ఎప్పుడూ లేటుగా వస్తుందన్న ధీమాతో రెండు నిమిషాలు ఆలస్యమయితే, ఈవాళే కొంప మునిగినట్లు వేగం వచ్చేసిందండీ."

"ఆఁ మరి నేను వస్తున్నానుగా! అందుకనే!" పెద్దమనిషి మీసాలు సుస్మితంగా దువ్వుకున్నాడు.

డిక్కీలో సామాను పెట్టాడు నారయ్య.

ధనవంతుని వజ్రపుటుంగరాల చెయ్యి అందంగా పట్టు జేబులోకి పోయి ముచ్చటైన ఒక్క రూపాయి తీసి నారయ్య చేతులో పెట్టి, అంతతో సంతృప్తిచెందక నారయ్య భుజం తట్టింది.

నారయ్య తలమునక లయ్యాడు.

"బాబూ....నాకేటీ దురాశ లేదండి. అయినా మీవంటోరిచ్చినప్పుడు....."

"ఫరవాలేదులేవోయ్. నీ మంచితనం చూసే నీకలా ఇవ్వాలని అనిపించింది. మనిషిని చూసి మనిషే జాలిపడకుంటే ఎలా? నీలాంటి పేదవాళ్ళు, మంచివాళ్ళు సంతోషిస్తేనే నాకెంతో ఆనందం. అలాగని నేనేదో పెద్ద దానం చేశానని మాత్రం అనుకోకు."

నారయ్యకేం మాట్లాడాలో కూడా తెలియలేదు. ఆయన భార్య పక్కనేవున్న పువ్వులమ్మేవాడిదగ్గర పూలు కొంటూంది.

"చుట్టా—బీడీ—సిగరెట్—పాన్!" బీడీలమ్మే కుర్రాడి కేక నారయ్య చెవుల్లో అమృతం పోసినట్లు వినిపించింది. ఆశగా అటు తిరిగి పిలవబోయాడు. కాని ఆయన వాడి చెయ్యి పట్టుకుని ఆపేడు.

"తాతా, నీ ఆకారం చూస్తూంటే పొద్దుటినుండీ పచ్చిమంచినీళ్ళయినా ముట్టినట్టులేదు. ఈ వెధవ బీడీలకి ఎందుకు డబ్బులు పోస్తావు? హాయిగా పోయి, ఆ రూపాయితో కడుపు చల్లబడేలా ఇంత అన్నం తిను. తరవాత డబ్బులుంటే బీడీ కొనుక్కో. నీ కంతగా కావాలంటే నాదగ్గిర సిగరెట్ ఉంది, తీసుకో!"

పాకెట్ తెరవబోతూంటే నారయ్య దణ్ణం పెడుతూ, "వద్దు, బాబూ, వద్దు. మీరిప్పటికే నామీద కానాదయ సూపించినారు. ధర్మ పెబువులు, మీలాంటోరు ఉండబట్టే మావొంటోళ్ల బొజ్జలు నిండుతున్నాయి."

ఆమె చేతిలో పూల పొట్లంతో వచ్చి కారు ఎక్కింది. ఆ పెద్దమనిషి కూడా ఆమెను అనుసరించాడు. నారయ్య కృతజ్ఞతతో చేతులు జోడించాడు.

కారు కదిలింది.

* * * *

నారయ్య హుషారుగా ఊళ్లోకి నడిచాడు. చేతిలోని

# పడగ నీడ

రూపాయి చక్కిలిగింతలు పెడుతూంటే ఉండబట్టలేక టీ అయినా తాగుదామని చిన్న రోడ్డుసైడు కాఫీక్లబ్బులోకి వెళ్లేడు. గల్లాపెట్టెమీద రూపాయి ఉంచి, "కమ్మని కప్పు టీ" అని అరిచాడు.

కాఫీ కొట్టు యజమాని బంగారుదాసు నారయ్యను ఎగాదిగా చూసి, "టీ లేదు. మరో హోటలికెళ్లి తాగు" అన్నాడు.

"పోనీ పెసరట్టు."

"అదీ లేదు."

"సరే, తినడానికేదుంటే అదియ్యి."

"తినటానికి కూడా ఏమీలేదు."

ఏమీ లేదన్నమాట వినేసరికి నారయ్యకు ఇంకా ఆకలి ఎక్కువయింది. రూపాయి తీసుకుని, అడుగులు తడబడుతూంటే బొంకుల దిబ్బవైపు నడిచాడు.

అప్పుడే నాలుగయింది. అప్పటికే రెండు భోజన సత్రవులకు వెళ్లడం, భోజనం లేదనిపించుకుని తిరిగి రావడం జరిగింది. నారయ్యకు కళ్లంట నీళ్లు తిరుగుతున్నాయి.

'ఏ...డబ్బుంటే కూడా దొరక్కుంటుందే!' మనస్సులోనే విసుక్కున్నాడు.

ఎదురుగా 'అన్నపూర్ణ విలాస్' అందంగా కనిపించింది. రంగురంగుల దుస్తుల్లో, ఫాషన్లలో జనం అటునుండి వస్తూపోతూ కనిపించారు. లోపలనుండి వస్తున్న కమ్మని వాసనలతో సగం కడుపు నింపుకుంటూ అటువేసి నడిచాడు నారయ్య.

మెట్లెక్కబోతూంటే అటునుండి వస్తూన్న జంట తనవైపు అసహ్యంగా చూసింది. కుళ్లు గుడ్డలు, చెమటతో తడిసిన నల్లని శరీరం, లోతుకుపోయిన కళ్లు చూసి వాళ్లు అసహ్యపడుతున్నారని గమనించాడు నారయ్య.

తనపై మీది గుడ్డ దగ్గరగా ముడుచుకుని పక్కకు తప్పుకోబోయాడు. కాలుజారి సైడుకాలువలో తూలి పడ్డాడు.

చేతిలో రూపాయి జారిపోయింది. చేతి ముణుకులు గీసుకుపోయి రక్తం చిమ్ముతూంది. ఒంటినిండా కుళ్లు బురద భరించలేని వాసన.

"అయ్యో నా రూపాయో!" వెర్రిగా అరిచి బురదలో రెండు చేతులూ పెట్టి వెతకటం ప్రారంభించాడు. ఆ రూపాయి ఉందన్న ఆశతోనే పొద్దుటినుంచీ ప్రాణాలు నిలుపుకుంటున్నాడు. అది పోయింది; నవనాడులూ క్రుంగిపోతున్నాయి; తల తిరిగి పోతూంది.

ఒంటినిండా బురద, కంటినిండా నీళ్లు. వణుకుతూన్న చేతులు మాత్రం వెతకటం మానలేదు.

ఎ. శ్యామలారాణి

మెట్లు దిగుతూన్న విలాసవతి, "ఛీ" అని చీదరించుకుని మరీ కదిలింది.

చిన్న చిన్న పిల్లలు, అప్పుడే స్కూలు విడిచినట్లున్నారు—నారయ్య చుట్టూ పోగయి ప్రళయమంత గోలా చేస్తున్నారు. పక్కనున్న బటాణీలమ్ముకునేవాడు పిల్లల నదిలించాడు.

"నా రూపాయి దొరికింది. ఇదుగో నా రూపాయి!" వెర్రిగా తనలో తనే అనుకుంటున్నాననుకుని గట్టిగా అరిచాడు నారయ్య.

వీధి కుళాయి దగ్గరికి వెళ్లి దాని బురద వదలగొట్టి మరోకసారి తృప్తిగా చూసుకున్నాడు. 'అవును తన పోయిన రూపాయి అది.' మళ్లీ కళ్లు ఆనందంతో మెరిశాయి.

'ఈ రూపాయి పోతే రోజల్లా పస్తుండవలసి వచ్చేది. నా మొగం...వస్తేనేంటి? నా పేనాలే పోయుండేవి; మారాజు మంచి మనసుతో ఇచ్చేడు! ఎందుకు పోతాది?'

ధనవంతుని రూపం కళ్ల ఎదుట మెదిలింది. చెయ్యెత్తి మరోసారి నమస్కరించాడు.

ఒంటినున్న బురదఅంతా కడుక్కుని రూపాయి చేత పట్టుకుని, 'అన్నపూర్ణవిలాస్'లో గర్వంగా అడుగు పెట్టాడు.

లోపల ఎంతో శుభ్రంగా ఉంది. అందమైన ప్లేట్లలో అంతకన్న అందమైన ఫలహారాలు! నోరూరి పోతూంది నారయ్యకు.

బెదురుగా చూశాడు. అక్కడ తను ఒక్కడూ ఎబ్బెట్టుగా కనిపించాడు. 'అయితే ఏం? తన దగ్గిరా రూపాయి ఉందిగా! అందరూ మాత్రం తిన్నదానికంటే ఎక్కువిచ్చేస్తారేంటి?' అనుకుని, నిటారుగా వెళ్లి మూలగా ఉన్న ఒక కుర్చీలో కూర్చున్నాడు.

సర్వరు అటు వచ్చి నారయ్య వైపు విభ్రాంతిగా చూశాడు.

నారయ్య లక్ష్యపెట్టలేదు. అంతేకాక, "రెండు పెసరట్, ఒక దోస" అని కూడా అన్నాడు.

సర్వరుకు కోపం వచ్చింది. "ఏమిటోయ్ నీ డాబు? మహారాజులా కూచుని ఆర్డరిస్తున్నావు! పస ఏమైనా ఉందా? ఉట్టి డాబేనా?"

నారయ్యకు ఒళ్లు మండింది. 'ఇంతమందొచ్చి కూసొనీ కూసోడంతోనే ఏం కావాలి సార్? అంటూ చేతులు కట్టుకుని వినయంగా నిలుసునే సర్వరుగాడు—తన దగ్గిర రూపాయి ఉందని తెలియదు కాబోలు, పెడ మాటలు మీరతన్నాడు' అనుకున్నాడు.

తక్కున రూపాయి తీసి బల్లమీద కొట్టి, "తీరిందా అనుమానం?" అని సగం గర్వంతో, సగం వాడి తలతిరుగుడు కట్టించానన్న సంతోషంతో అడిగాడు.

వాడు ఆ రూపాయి తీసి బొటనవేలితో ఎగరేసికొట్టి నారయ్య మీదికి విసిరాడు.

నారయ్య తెల్లబోయాడు.

"దగుల్బాజీ! నీసంగతి నాకు తెలియదట్రా? నీలాంటోళ్లు తేరగా తినిపోదామని సవాలక్ష ప్రయత్నాలు చేస్తూంటారు రోజూ. నాదగ్గిరా నీ ఆటలు! రా, నీ పని చెబుతాను" అని రెక్క పట్టుకుని గొర

గొరా ఈడ్చుకుంటూ యజమాని దగ్గిరికి తీసుకు వెళ్ళాడు.

యజమాని చాలా తొందర పనిలో ఉన్నాడు సర్వరు మెల్లిగా వెళ్ళి ప్రొప్రయిటరు చెవిలో సంగతి చేరేశాడు. రౌద్రాకారం దాల్చాడతను.

"స్కౌండ్రల్, సత్తు రూపాయి తెచ్చి తేరగా మింగిపోదామనుకున్నావురా? రోగ్! లోఫర్! గెటవుట్, ఇడియట్!"

నారయ్య నీళ్ళు కారిపోయాడు. కడుపులోంచి దుఃఖం పెల్లుబికి కన్నీటిరూపంలో బయటికి వచ్చింది.

"బాబా, నానేం మోసం చెయ్యబోనేదండి. మద్దాన్నం మెయిల్లోంచి దిగిన బాబు ఇచ్చిన రూపాయండి. పావలే చాలు బాబా అంటే రూపాయి ఇచ్చారండి." కొద్దిగా కళ్ళు తుడుచుకున్నాడు.

"ఆఁ...ఎవడ్రా అంత ధర్మాత్ముడీరోజుల్లో? పిచాలకం చూసి నీకు కట్టపెట్టి చల్లగా జారుకున్నాడు. హ హ" అని నారయ్య వైపు ఎగతాళిగా చూశాడు.

'పెద్ద మడిసిలా కనిపించి నన్నింత మోసం సేసినావయ్యా!' అనుకున్నాడు నారయ్య. బంగారుదాను కొట్లో రూపాయి చూసి 'ఏమీ లేవు పో'మ్మన్న మాటలు జ్ఞాపకం వచ్చాయి.

అది సత్తురూపాయి. అందుకే వాళ్ళంతా తనను, ఆ రూపాయిని ఎగాదిగా చూసి పొమ్మన్నారు. ఆనందంతో మైమరిచిన తనకు అసలు ఆ రూపాయి మంచిదో, కాదో చూసే తెలివెక్కడిది?

నారయ్య తలవంచుకుని దిగులుగా బయటికి వస్తున్నాడు. గుమ్మం ఇవతలే నిలబడి, ఇంతసేపూ లోపల జరుగుతూన్న గలాటా అంతా చూస్తున్నారు ముగ్గురమ్మాయిలు. చేతుల్లో పుస్తకాలు, రిస్టువాచీలు చూస్తే చదువుకుంటున్నట్టే ఉన్నారు.

వాళ్ళలోనుంచి ఒక నాజూకైన యువతి నారయ్యను పిలిచింది. దగ్గిరగా వెళ్ళి "ఏం?" అన్నాడు నారయ్య

"అసలేం జరిగింది?"

"సెప్పేదేటమ్మా! ఈయాల నారోజిలా ఉంది. తెల్లారి లేచినకాణ్ణించి ఎక్కడా కూలి దొరకనేదు. టేసన్లోకెల్లి కూకున్నాను. రెండు గంటలకి మెయిలొచ్చింది. రెండో కలాసు పెట్లోంచి దిగిన ఓ పెద్ద మడిసి నాచేత సామాను మోయించుకున్నాడు. పెద్ద కారు బీసం సూస్తే ఏమోననుకున్నాను. నాకియ్యవలసిన పావులా డబ్బులికి మోసం సేసి, దానకర్ణుడినా సత్తు రూపాయి సేతులెట్టి సక్కా పోయినాడు. ఎంత గ్లానమో సూడండి! నా కడుపు తరుక్కుపోతంది. ఆకలి. సచ్చిపోతన్నాను. కానీయండి. నోకం ఇంతే. నాలాంటోళ్ళకి కూడునేదు. ఎదవ రూపాయి—రోజల్లా దీంతోనే సచ్చాను."

కళ్ళు తుడుచుకుని చేతిలోని రూపాయివైపు క్రోధంగా చూసి బయటికి విసిరేయబోయాడు.

ఆమె అతన్ని వారించి, "ఆ రూపాయి నాకిచ్చెయ్" అని తీసుకుని పర్సులో వెయ్యిపెట్టి ఎదిరూపాయల కాగితం తీసి వాడికి ఇవ్వబోయింది.

నారయ్యకు సహనం నశించింది.

"వద్దమ్మా, ఒద్దు. మువ్వు ధనవంతురాలివయితే నీకాడే ఉంచుకో. ఈయాల అతగాడిచ్చిన రూపాయి రోజల్లా తిండి నేకుండా సేసింది. మువ్విచ్చే ఈ పది



ప్రశాంత ప్రకృతి — చిత్రం — జి. నాగేశ్వరరావు (హైదరాబాదు)

రూపాయలు నాకు వారం రోజులు తిండి నేకుండా సేస్తాయేమో! నాకొద్దు బాబా! పాపిష్టి డబ్బు."

"అలాకాదు తీసుకో. అందరూ మోసగాళ్ళనుకోకు. నేను మనసూఫర్తిగా ఇస్తున్నాను. తీసుకో."

చేతులో బలవంతాన ఉంచిన డబ్బు తప్పనిసరిగా తీసుకుని బయటికి నడిచాడు నారయ్య.

లోపలికి వస్తున్న లలితను ప్రొప్రయిటరు ఆదరంగా ఆహ్వానించాడు.

"సర్వర్, అడ్వకేటు రాజారావుగారి అమ్మాయి వచ్చారు. తీసుకువెళ్ళి ఏం కావాలో చూడు" అని కూడా కేకవేశాడు.

రాజారావుగారి అమ్మాయి లలిత స్నేహితులతో సహా టిఫిను తీసుకుని ముచ్చటగా మూడు రూపాయలు ప్రొప్రయిటరుకు అందించింది.

వినయంతో, గౌరవంతో తపించిపోతూన్న ప్రొప్రయిటరు యథాలాపంగా అందుకుని, అవటాన పెట్లో వేసుకుని బిళ్ళిచ్చి చిరునవ్వుతో సాగనంపేడు.

అక్కడ సత్తు రూపాయికి ఉన్న విలువకు తనలో తనే ఆశ్చర్యపోతూ, "మంచి మజా చేశా"నని స్నేహితులతో చెప్పింది. వాళ్ళు తెల్లబోయారు.

• • •

అడ్వకేటు రాజారావుగారుమరునాడు కోర్టులో జరగబోయే కేసుకుసంబంధించినఫైళ్ళు తిరగేస్తున్నారు.

లలిత తీరికగా వచ్చి కూర్చొని, ఆరోజు సాయంకాలం హోటలు దగ్గిర జరిగిన సంగతంతా చెప్పింది.

"నాన్నగారూ, మీరు చెప్పండి. మీరు న్యాయవాదికారులు కనక సరిగా చెప్పగలరు. అటువంటి వాణ్ణి ఏం చెయ్యాలి? అంత డబ్బు ఉంచుకుని పావలాడబ్బుల కక్కుర్తి కోసం సత్తు రూపాయి అంటకట్టిన దౌర్భాగ్యుడు! సిల్లీ ఫెలో, ఛీ..ఛీ!" పీలయినంతగా అసహ్యించుకుంది.

అప్పటికే నల్లబడిపోయిన రాజారావుగారి ముఖాన్ని పరిశీలనగా ఒకసారి చూసి అక్కడినుండి వెళ్ళిపోయింది లలిత. ★